# ఇవీ జీవితాలే.......

## వి. వెంకట్రావు

"మీ కథ పుస్తకంలో వచ్చిందట. మాకు చెప్పనేలేదు" నిష్ఠూరంగా అడిగాడు ప్రక్కషాపతను.

"మీరు కథ చదివేరేమోనని అనుకున్నానండి. పోనీ ఇప్పుడైతే మాత్రం ఏం పోయింది ఇదిగో చూడండి"

పుస్తకం అందుకుని అటూ ఇటూ తిరగేసి "బాగుందండి" అన్నాడు.

"ఏమిటి బాగుండడం చదవకుండానే"

"కథకి వేసిన బొమ్మండి. బొమ్మ బాగుందంటున్నాను. బొమ్మ మీరే వేస్తారా?"

"బొమ్మ నేనెయ్యడం ఏమిటి, ఆర్టిస్టు వేస్తాడు"

"అదేలెండి ఆర్టిస్టు చేత మీరే వేయించి పంపించారా అని"

"మనమేమి వేయించనక్కరలేదండి. కథ పంపిస్తే చాలు. కథ నచ్చితే, ఆ బొమ్మలేవో వాళ్ళే వేయించుకుంటారు"

"నచ్చకపోతే ఆ పోస్టల్ చార్జీలు, రాయడం అంతా దండగేనా?"

"మరి అంతేగదండి"

"నచ్చితే కథకి ఎంత పంపిస్తారేమిటి?"

ఈ మనిషి ఎలాంటివాడో, ఈతని జాతకం అంతా నాకు తెలుసు. అందుకే కాస్త ఆట పట్టించడానికి

"ఏమిటి డబ్బులా? కథకి ఓ పదివేలు పంపిస్తారనుకోండి" సరదాగా అన్నాను.

"ఏమిటి పదివేలే. అదీ సంగతి, అందుకే పంపిస్తున్నారు. మీ వ్యాపారమే బాగుందండి. నెలకు ఓ నాలుగు కథలు పంపిస్తే చాలు. నలభైవేలు. బోలెడంత డబ్బులు, మదుపేం ఉంది. కాగితం, పెన్నే కదా? ఏ వ్యాపారంలో మాత్రం ఇంత లాభాలు వస్తాయి. నేనప్పుడే అనుకున్నాను. పుస్తకాల్లో కథలు రాసేవాళ్ళు మాత్రం వెర్రివాళ్లా. ఎన్నేసి కథలు రాసి, ఎంతెంత డబ్బు గడించేస్తారోనని లాభం లేకుండా ఈ రోజుల్లో ఎవడు మాత్రం ఏంచేస్తారు చెప్పండి. ఏమిటో మా వ్యాపారాలు, మా సొద మాదే తప్ప ఇలాంటివి మాకు తెలీవు".

"ఏమిటి? నిజంగా నమ్మేశారా? పదివేలంటే, మంచివాళ్లే ఏదో సరదాకి అంటే అదే పట్టుకున్నారు. అంత పంపించరండి బాబూ"

"మరెంత పంపిస్తారుచెప్పండి. దాన్నిబట్టి ఉంటుంది లాభమో, నష్టమో, ఆ నష్టం ఎందుకొస్తుంది లెండి. పెట్టుబడేం లేదుగా పోస్టల్ చార్జీలతో కలిపినా ఇరవై కంటే ఎక్కువ అవ్వదు. ఆపై ఎంతొచ్చినా లాభమే"

"సరే డబ్బు సంగతి అలా ఉంచండి. కథ చదివి చెప్పండి ఎలా ఉందో?"

"తరువాత చదువుతాను గాని, ముందీ సంగతి చెప్పండి. పత్రికల వాళ్ళు ఎంత పంపించారో"

ఎంత పంపించారో చెబితేగాని ఈయన చదివేలాగా లేడు. ఎంతో కొంత చెప్పేయాలి. నిజానికి ఎంత పంపిస్తారో నాక్కూడా తెలీదు.

"కథకి ఓ రెండు వందలనుకోండి"

"ఏమిటి రెండు వందలా, ఇంతేనా ఆ మాత్రం మొత్తానికి ఎందుకండి తలలు బద్దలు కొట్టుకోవడం. ఆ మాత్రం డబ్బులు రోడ్డు ప్రక్కన బనీన్లు అమ్ముకునే వాడు కూడా గడిస్తాడు.

ఇదేమిటి ఇలా పట్టుకున్నాడు. డబ్బులు పంపిస్తారంటే లాభాల కోసమేనంటాడు. డబ్బులు పంపరంటే ఎందుకొచ్చిన తలనొప్పి అంటాడు.

"డబ్బుల కోసం కాదండి. అదో సృజనాత్మకత.

సృజనాత్మకత అంటే ఏమిటో అతనికి ఏమీతెలియదు, సరికదా ఆ పదమే ఎప్పుడూ విని ఉండదని నాకు తెలుసు. ఎందుకంటే ఇతను పదవ తరగతి చదువుతుండగానే అప్పుడప్పుడు వాళ్ళనాన్న బట్టలకొట్టుకి వచ్చేవాడు. వాళ్ళ నాన్న పార్టీలకు డబ్బులివ్వడం, పార్టీల దగ్గర నుండి డబ్బులు పుచ్చుకోవడం చాలాసార్లు చూసాడు.

వాళ్లనాన్న ఒకసారి ఏదైనా కొనుక్కోమని డబ్బులు ఇస్తే, దగ్గర్లోనే ఉన్న మిఠాయి కొట్లో రస్‌మలాయ్ కొనుక్కున్నాడు. అప్పుడే కాదు వాళ్ళ నాన్న డబ్బులు ఇచ్చినప్పుడల్లా అదే కొనుక్కొనేవాడు.

అప్పుడే తెలిసింది రస్‌మలాయ్ రుచీ, డబ్బులు రుచీ కూడా.

షాపులో వాళ్ళ నాన్న డబ్బులు లెక్కపెట్టడం చూసినప్పుడల్లా అనుకునేవాడు, 'నేనెప్పుడు ఇలా డబ్బులు లెక్కపెడతానోనని.'

అందరూ వ్యాపారాలు చేసే, డబ్బులు గడించేస్తుంటే, నేనేమిటి ఇంకా చదువో, చదువో అంటు ఎన్నాళ్లు స్కూలుకీ, ఇంటికీ తిరుగుతాను. ఊహూ ఇలా లాభంలేదు. మనం కూడా డబ్బులు లెక్కపెట్టవలసిందే' అనుకున్నాడు.

'అంతే కాదు అలా డబ్బులు లెక్కపెట్టాలంటే స్కూల్ మానేయ్యాలి' అనుకున్నాడు.

అంతటితో ఆగలేదు. 'స్కూల్ మానెయ్యాలంటే పరీక్షలు తప్పాలని కూడా' అనుకున్నాడు.


అందుకే పదవ తరగతి పరీక్షల్లో ఇంగ్లీషు, సైన్సు, బొత్తిగా తెల్లకాగితం ఇచ్చేస్తే అనుమానం వస్తుందని కావాలనే ఏదేదో రాసేసాడు.

అనుకున్నట్లుగానే ఇంగ్లీషులో మూడు, సైన్సులో రెండు వచ్చాయి. మార్కులు చూసి 'నీకు చదువు అబ్బదు. కొట్లోకి పద' అన్నాడు తండ్రి.

'నాక్కావలసిందీ అదే' అనుకున్నాడు కొడుకు.

ఆరోజు నుండి షాపులోకి వచ్చేశాడు. ఇక అక్కడ నుండీ షాపే లోకం. డబ్బే లోకం.

ఇంగ్లీషుకి రెండూ, సైన్సులో మూడు మార్కులైతే వచ్చాయి గానీ, లెక్కల్లో మాత్రం దెబ్బయి మార్కులొచ్చాయి. దానికీ తగిన కారణం ఉంది. అతనికి అన్నిటికన్నా ఇష్టమైన సబ్జెక్ట్ లెక్కలు. లెక్కల్లో అతనికి అయిదు లీటర్ల పాలలో, మూడు లీటర్లనీళ్ళు కలిపితే ఎంత వచ్చును? లాంటి లెక్కలు బాగా నచ్చేవి.




వెయ్యి రూపాయిలకీ, నూటికి అయిదు రూపాయలు వడ్డీ చొప్పున సంవత్సరానికి ఎంత అగును? లాంటి లెక్కలు మరీ నచ్చేవి. చక్రవడ్డీ లెక్కలైతే ఇంకా బాగా నచ్చాయి.

అమ్మిన వెల నుండి కొన్న వెల తీసేస్తే లాభం వచ్చును. అనే లెక్క చదివి నప్పుడైతే పుస్తకాన్ని ఒక్కసారిగా గుండె లకు హత్తుకున్నాడు. అతని జీవితం మీద లెక్కల ప్రభావం ఎక్కువగా ఉంది.

షాపులోనికి వెళ్ళిన వెంటనే వేరు కుంపటి ఆలోచనలు ప్రారంభం అయ్యాయి. చిన్న చిన్న మొత్తం తండ్రికి తెలియకుండా అప్పులు ఇవ్వ ప్రారం భించాడు. దీనిమీద వచ్చిన వడ్డీలను మళ్ళీ అప్పులు ఇచ్చేవాడు. బ్యాంక్ ఖాతా కూడా తండ్రికి తెలియ కుండా తెరిచాడు. కొన్నాళ్ళకి కొడుకు రహస్య వ్యాపారం తండ్రికి తెలిసిపోయింది.

కోపం తెచ్చుకోలేదు. పైగా కొడుకు బతకనేర్చిన తనానికి చాలా సంతోషించాడు.

'షాపు, ఇల్లునువ్వే చూసుకో' అన్నాడు.

అంతటితో వేరు కుంపటి, ఇంటి కుంపటితో కలిసిపోయి పెద్ద కుంపటి అయిపోయింది. ఆ కుంపటిలో ఎప్పుడూ నిప్పులు రాజుతునే ఉంటాయి.

తర్వాత కాలంలో కొడుకు చాలా పెద్ద మొత్తానికి అమ్ముడుపోయాడు. అమ్మాయి గుణ గణాలకీ, అందచందాలకీ పెద్దగా ప్రాముఖ్యతను ఇవ్వలేదు. రేపొద్దున్న వ్యాపారంలో ఒడిదుడుకులు వస్తే, ఆదుకోవడానికి అత్తవారికి స్తోమత ఉందా? లేదా? అనే ఆలోచించాడు. అలా స్తోమత ఉన్న అత్తవారినే చూసుకున్నాడు. ఈ పెళ్లి అయిన తరువాత పిల్ల గలవాళ్ళు బాగా చితికిపోయారని అంతా అను కుంటారు.

ఆ ఇంట్లో కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగింది.

ఇప్పుడు ఆ కుటుంబ సభ్యులంతా ఆ కుంపటి దగ్గరే చలికాగుతారు. ఆ కుంపటికి ఓ విచిత్ర గుణం ఉంది. అది చలికాలంలో వెచ్చదనాన్ని ఇవ్వడమే కాదు. వేసవిలో ఫ్రిజ్‌లాగా పనిచేస్తుంది. ఎయిర్ కూలర్‌లాగా పనిచేస్తుంది. ఇంకా అనేక రూపాలు ధరిస్తుంది. ఎప్పుడు ఎలా కావాలంటే అలా కోరిన వరాలిచ్చే అక్షయపాత్రలాంటిది ఆ కుంపటి. అందుకే ఆ కుంపటి అంటే అంత మక్కువ ఆ కొడుక్కి.

ఇప్పుడు ఏ తాత్వికుడైనా అతన్ని మనిషి ఎందుకు పుట్టాడని ప్రశ్నిస్తే?

అతన్నుండి వచ్చే మొదటి సమాధానం 'తినడానికి'

రెండవ సమాధానం 'డబ్బులు లెక్క పెట్టడానికి'

అతని దృష్టిలో జీవితానికి అర్థం, పర మార్థం, వ్యతిరేకార్థం, ప్రతిపదార్థం, తాత్పర్యం అన్నీ డబ్బులు లెక్కపెట్టడమే.

కాసేపు అతని గతాన్ని వదిలిపెట్టి వర్త మానానికి అంటే సృజనాత్మకత దగ్గరకొస్తే "సృజనాత్మకత అంటే ?" అడిగాడతను.

"అంటే అదో సరదాగా అనుకోండి"

పెద్ద పెట్టున ఒక్కసారిగా నవ్వి అదేం సరదాలండి. చేతి చమురు బాగోతం సరదాలు. ఒక ఆదివారం మా ఇంటికి రండి చూద్దురు గానీ సరదా అంటే ఏమిటో చూపిస్తాను."

"పోనీ చెప్పండి"

"ఆదివారం టిఫిన్లు అయిన తరువాత మా కూతురూ, అల్లుడూ, మా కొడుకూ, కోడలూ అందరం కలసి ఆడతాం. ఏటీ పేకాట... ఎవరికి వచ్చినా రాత్రి అందరం కలసి రెస్టారెంట్‌కి వెళతాం. డబ్బులు వచ్చినవాళ్లు బిల్లు ఇవ్వాలి. అదీ ఒప్పందం. పోయినా బాధలేదు. వచ్చినా బాధలేదు. వచ్చినా మాకే, పోయినా మాకే".

"ఆమాత్రం భాగ్యానికి ఆడటం ఎందుకు?"

"అదేనండి మీతో వచ్చిన తంటా సరిగ్గా అర్థం చేసుకోరు. ఆడకపోతే సరదా ఎలా తీరుతుంది. సాయంత్రం వరకూ టైమ్ పాసవ్వాలా? వద్దా? సరదా తీరినట్లు ఉంటుందీ, డబ్బులూ ఎక్కడకీ పోవు."

"సరదా తీరాలంటే పేకాటాడాలా? ప్రపం చంలో ఎన్ని లేవు"

ఎందుకు లేవు. అందుకే సాయంత్రం వరకే పేకాట. రాత్రికి అందరం కలసి రెస్టారెంట్‌కి వెళతాం అని చెప్పా కదా. వెళ్లే ముందు ఒకగంట ముందుగా నేను బయటికి వెళ్లిపోతాను. ఎక్కడికని అడగరేం. బార్‌కి. అక్కడికి మా ఫ్రెండ్ రామనాధం లేదూ ! వాడొస్తాడు. ఆదైతే రోజూ వెళ్తాడను కోండి. అది మాత్రం మంచిది కాదు లెండి. ఎంత తాగితే మాత్రం రోజూ తాగాలా. వారం అంతా వ్యాపారం. శలవు రోజున ఎంజాయ్.

"అతను కూడా మీలాగే అను కుంటాడు. రోజంతా వ్యాపారం రాత్ర యితే ఎంజాయ్ తప్పేం ఉంది." అన్నాను నేను.

"అది మంచిది కాదులెండి. రోజు తాగడం అంటే మరీ బానిస అయిపోవడమే."

అతనూ మీలాగే అనుకుంటాడు. నేనేమన్నా వ్యాపారం టైములో తాగుతున్నానా? పగలల్లా వ్యాపారం, రాత్రిపూట ఎంజాయ్ అని మీ నీతి మీది. ఆయన్నీతి ఆయనిది. ఇప్పుడు కాదెన్న దెవరు కానీయండి."

"అదండీ శలవురోజు మా కార్యక్రమం లైఫ్ అన్న తరువాత ఎంజాయ్ చెయ్యాలండీ". ఎంజాయ్ అంటూ గట్టిగా అన్నాడు. ఇలాంటి మనుషులతో మాట్లాడటం కూడా టైమ్ వేస్ట్ అని మనసులోనే అనుకుని ఇంటికి బయలుదేరాను.

✿ ✿ ✿

మావీధి మలుపు తిరగగానే, దూరం నుండే కనిపించింది. ఎదురింటి మామ్మగారు. నన్ను చూసిందంటే పట్టుకుంటుంది. కథ చదివే ఉంటుంది మనసులోనే అనుకున్నాను.

మామ్మగారితో సంభాషించే ముందు, ఈమె గురించి కొంత చెప్పాలి.

స్త్రీ పెళ్లికాక ముందు తల్లిదండ్రుల మీదా పెళ్ళి అయిన తరువాత భర్తమీదా, తదనంతరం పిల్లలమీదా ఆధారపడుతుందని చెబుతారు స్త్రీ వాదులు. ఆ విషయాలన్నీ ఈమె విషయంలో నిజమే. ఈమె పెళ్ళికాకముందు సంగతి ఎవరికీ తెలియదు గానీ, పెళ్లయిన తరువాత మాత్రం పూర్తిగా భర్తమీదే ఆధారపడింది.

ఎలాగంటే ఈమెకు పనిగండం ఉందని ఎవరో చెప్పారట. అప్పటినుండి ఇంట్లో ఇటు చీపురు పుల్ల అటు వెయ్యదు. ఏ టైములో ఎవరు చూసినా ఇంట్లో పాత కర్ర కుర్చీ మీద పుస్తకం చదువుతూ కనిపిస్తుంది.

ఈమె భర్త ఏదో ప్రభుత్వ కార్యాలయంలో అటెండరుగా పనిచేసేవాడు. కాస్త సాహిత్య అభిలాష ఉన్నవ్యక్తి. ఇంటినిండా పుస్తకాలు ఉండేవి.

ఈమె భర్త మగవాళ్ళు కూడా ఇంట్లో పనులు చెయ్యాలి అనే వాక్యాన్ని కాస్త తప్పుగా అర్థం చేసుకొని మగవాళ్ళు మాత్రమే ఇంట్లో పనులు చెయ్యాలి

# భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథానికల పోటీ

నిర్వహణ : మినీకవిత మాసపత్రిక

## నియమ నిబంధనలు

✿ పోటీల్లో గెలుపొందిన కథా రచయితలకు ప్రథమ బహుమతిగా రు. 1,116/-లు, ద్వితీయ బహుమతిగా రు. 516/-లు, తృతీయ బహుమతిగా రు. 216/-లతో పాటు జ్ఞాపిక, శాలువతో సత్కరించబడును.

✿ కథ నిడివి అచ్చులో ఒక పేజీకి మించరాదు.

✿ రచయిత వివరాలు కథపై కాకుండా వేరే కాగితంపై పొందపరచవలెను.

✿ హామీపత్రం (ఈ కథ తన స్వంతరచన అని, దేనికి అనుకరణగాని, అనువాదం గాని కాదని, ఇంతవరకు ఈ కథ ప్రచురింపబడలేదని, ఏ యితర పత్రికలకు గాని, శ్రవ్య, దృశ్య మాధ్య మాలకు గాని పంపలేదని ధృవీకరణ పత్రం జత పరచాలి.)

✿ కథలు చేరవలసిన ముగింపుతేదీ : **30 నవంబరు 2008**

✿ బహుమతి పొందిన రచయితే స్వయంగా బహుమతిని తీసుకొనవలెను. ఇతరులు అనుమతించబడరు.

✿ కవరుపై 'సంక్రాంతి కథానికల పోటీ'కి అని వ్రుదహరించాలి.

**ఈ కథానికల పోటీలకు ప్రముఖ కథకులు, అనువాదకులు శ్రీ ఎల్.ఆర్. స్వామి, విశాఖపట్నం స్పాన్సర్ చేస్తున్నారు.**

✿ కథలు పంపవలసిన చిరునామా :

మినీకవిత మాసపత్రిక

27, 28. 3వ అంతస్థు, దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,

గాంధీనగర్, విజయవాడ - 520 003.

✆ 0866-6640595, సెల్ : 9848132208

అనుకున్నాడు. అందుకే ఇంట్లో పనంతా తనే చేసేవాడు. దానికి ఆమె బద్ధకం తోడయ్యింది. మొత్తానికి ఆమె పని చేస్తుండగా ఈనాటి వరకూ ఎవరూ చూడలేదు.

ఇంట్లో కూర్చుని, కూర్చుని విసుగొచ్చిందో ఏమో అప్పుడప్పుడూ మహిళా సంఘాల్లో తిరిగేది.

ఇంటినిండా మంచి మంచి పుస్తకాలున్నా, పానకంలో గరిటెలాగా అందులోని తీపిని ఆస్వాదించలేదు.

పుస్తకం హస్తభూషణం అన్నట్లుగా ఆమె చేతిలో ఎప్పుడూ పుస్తకం మాత్రం ఉంటుంది.

ఈమె మహిళా ఉద్యమాల్లో తిరిగే రోజుల్లో ఇంట్లో ఎవరికీ తెలియకుండా, ఒక గూట్లో పాత మాసిన రవికల గుడ్డ చిన్న తెరలాగా ఏర్పాటుచేసి, రహస్యంగా దేవుడికి దండాలు పెట్టేది. ఈమె రహస్యంగా దండాలు పెట్టడం ఎవరో రహస్యంగా చూసేసారు.

ఏ పని చెయ్యనివ్వకుండా చాలా సుఖ పెట్టేసి, కొంత కాలానికి భర్త పరలోకం వెళ్ళి పోయాడు. ఈమెకు ఒక్కడే కొడుకూ, కోడలూ, మనవడు.

ఈ మామ్మగారు నవ్వడం ఇంత వరకూ ఎవ్వరూ చూడలేదు.

పదేళ్ల క్రితం ఒకసారి నవ్విందని, వీధిలో ఒకతను అంటే, ఛ అదేం కాదు ఏదో సందర్భంలో పళ్ళు చూపించింది. అంత మాత్రాన అది నవ్వయి పోతుందా? అని వేరొకతను వాదనకు దిగాడు.

కాదు, కాదు నవ్వే అని మొదటివ్యక్తి, ఇలా ఒకసారి వాదించుకున్నారు. మొత్తానికి అది నవ్వో కాదో ఇప్పటికీ తేలలేదు.

ఏది ఏమైనా ఆ తరువాత అంటే ఈ పదేళ్ల కాలంలోను మరి నవ్వలేదు అనేది మాత్రం నిర్వివాదాంశం.

ముఖం ఎప్పుడూ ధుమ ధుమలాడుతూ, నిప్పుల కుంపటిలాగా మండిపోతూ ఉంటుంది.

ఒకసారి వీధిలో కుళాయినీళ్ళు పడుతుండగా... పని మనిషి ఇంట్లోకి వెళ్ళింది. బిందెలో నీళ్ళు నిండి బయటకు పోతున్నాయి. ఎదురుగానే కుర్చీలో కూర్చుంది మామ్మగారు. ప్రక్కనే ఉన్న ఖాళీ బిందె మార్చనైనా మార్చలేదు. అలాగే చూస్తూ, లోపల ఉన్న పనిమనిషి మీద కేకలు ప్రారంభించింది.

"ఎక్కడ తగలడ్డావే లోపల, ఇక్కడ ధార పోతుంటే లోపలేం చేస్తున్నావు. ఎక్కడంటే అక్కడే ఉండిపోతావు. వేగిరం రా" అంటూ కేకలు వేసే సరికి పరుగు, పరుగున వచ్చి పనిమనిషి బిందె మార్చింది.

"ఎదురుగానే ఉన్నారు కదామ్మా! ఆ మాత్రం బిందెమార్చకూడదా? లోపల మాత్రం నా ఇంట్లో పనేమైనా చేసుకుంటున్నానా? మీ పనే కదా ! ధార పోతుంటే చూసి ఊరుకున్నారు గానీ" అంది.

ఆ మాత్రం సమాధానానికే అగ్ని రుద్రురాలయిపోయింది మామ్మగారు.

"నేను నీళ్ళు పట్టాలా? మరి నిన్నెందుకే బోలెడు జీతం ఇచ్చి పెట్టుకుంది. నేను నీళ్ళు పడుతుంటే నువ్వేం చేస్తావ్. "ఏకమొయ్య మెక్కుతావా? మా "మాడు మొఖం" వాళ్ళ సొమ్ము బాగా తింటున్నావు. ఎప్పుడు అచ్చున్నావో" అంటూ చాలా సేపు తిట్టింది.

"సాల్లెండమ్మా. గొప్ప ఇంటిపేరు సంపాదించారు. మొఖానికి తగిన ఇంటిపేరే. కూకున్న దగ్గరికి కూడూ, నిలుసున్న దగ్గరికినీళ్ళు వస్తుంటే మాటలు ఇలాగే ఉంటాయి" అంది పనిమనిషి.

ఈ మామ్మగారి గురించి మా వీధంతా చాలా చెప్పుకుంటారు. చాలా గమ్మత్తయిన, గడుసైన మనిషి. 'నాకు షుగరు ఏమీ తినలేను' అంటుంది గాని రోజుకు నాలుగు పప్పుండలు తింటుంది.


"ఎక్కడికి నడవలేను. కాళ్ళు పీకులు' అంటుంది గానీ, పెళ్లి భోజనాలకి

ఎవరైనా చెబితే ఉదయం పదకొండు గంటలకే వెళ్లుతుంది.

వీధిలో అందరూ చూస్తుండగా చీపురు పట్టుకుని తను అప్పుడప్పుడు కూర్చునే అరుగు తుడుస్తుంది. వీధిలో ఎవరూ లేకపోతే ఆ దుమ్ము, ధూళిలోనే కూర్చుండిపోతుంది.

కళ్ళతో చూడకపోతే లోకంలో ఇలాంటి మనిషి ఉందని నమ్మడం కష్టం.

ఈ మధ్యనే కొత్తగా మెడలోని గొలుసు చేయించాడు కొడుకు. గొలుసు చేయించే వరకూ కొడుకును తినేసింది. కొడుకు ఏదో వీధిలో చీటీలు వేస్తే కొంత మొత్తం అందింది. అప్పటికే కొంచెం, కొంచెం అప్పులు ఉన్నాయి కొడుక్కి.




ఆ కొడుకు, కొడుక్కి ఆ మధ్య టైఫాయిడ్ జ్వరం వస్తే చాలా ఖర్చయింది. మొత్తానికి జ్వరం తగ్గింది కానీ అప్పు మాత్రం మిగిలింది. దానికి నెల నెలా వడ్డీలు కడుతున్నాడు. ఈ చీటీ సొమ్ము అందిన వెంటనే తీర్చేద్దామని అనుకున్నాడు.

సరిగ్గా అప్పుడే ఈ మామ్మగారు "గొలుసు చేయించమని" పట్టుకుంది కొడుకుని

"అది కాదమ్మ చిల్లర మల్లర అప్పులు చాలా ఉన్నాయి. బాబుకి జబ్బు పడినప్పుడు చేసిన అప్పు కూడా అలాగే ఉండిపోయింది. నీకు గొలుసు తరువాత చీటి అందుకుని చేయిస్తాలే" అన్నాడు.

ఆc..... తరువాత చేస్తావా? తరువాత అంటే ఎప్పుడు, నేను చచ్చిన తరువాత నా శవానికి చేయిస్తావా? ఆ మాత్రం నా సరదా తీర్చలేవా? తల్లిని ఇంకెన్నాళ్లు బ్రతుకుతానని, ఆ మాత్రం నా ముచ్చట తీర్చకూడదా? నేను పోతే ఆ గొలుసు ఎవరికీ; నీకే కదా నేనేంపట్టుకుపోతానా? ఏదో ఒక వస్తువు ఆస్థిలాగా ఉంటుంది. నా సరదా తీర్చినట్టూ ఉంటుంది. అప్పులదేముంది అప్పులు ఎప్పుడు ఉంటూనే ఉంటాయి. తీర్చుకుంటాం. తీర్చుకోక మానేస్తామా? అంటూ ఏడుపు ముఖం పెట్టింది.

మనవడికి టైఫాయిడ్ పడిన రోజుల్లో ఆ గదిలోనికే రాకుండా, గది బయటనుండే 'ఎలా ఉంది' అని పలకరించేది. దగ్గరకు వెళ్తే ఆ టైఫాయిడ్ అంటుకుంటుందని భయమో, ఏమో ?

"ఎంత తల్లయితే మాత్రం ఒక ఒక్కమాలిన కోరిక కోరితే అలాంటి కోరికలన్నీ తీర్చుకుని నువ్వు అప్పులపాలై పోవడం మంచిది కాదు" ఒకరిద్దరు శ్రేయోభిలాషులు చెప్పారు.

కానీ అంతకన్నా ఎక్కువగా తల్లి సొణుగుడు భరించలేకపోయాడు. అంతకన్నా వడ్డీలు కట్టుకోవడమే సుఖం అనుకున్నాడు. మొత్తానికి మామ్మగారి మెడలో గొలుసు చేరింది.

వీధిలోనికి వచ్చే పొయ్యే వాళ్ళందరికి గొలుసు చూపిస్తుంది. ఎలాగుందీ అని అడుగుతుంది చాలా బాగుందని అంటారు వాళ్ళు.... లోలోపలే నవ్వుకుంటుంది.

ఇంట్లోకి వెళ్లబోతుంటే, చూడనే చూసిందా మామ్మగారు నన్ను.

"నీ కథ చదివానయ్యా ! చాలా బాగుంది అంది" గొలుసు సవరించుకుంటూ.

"అహ అలాగండీ మామ్మగారు చాలా సంతోషం" అంటూ వెళ్ళిపోతుంటే

"ఇంకా ఏమైనా కథలు రాస్తున్నావా?" అంది ఈ సారి కూడా గొలుసు సవరించుకుంటూ ఆమె కావాలనే మాటలు పెంచుతుంది అనే విషయం అర్థం అయిపోయింది.

"ఇంకా ఏమీ లేదండి"

"ఈసారి రాస్తే పత్రిక్కి పంపకముందే నాకు చూపించాలి" అంది మళ్లీ గొలుసు సవరించుకుంటూ అసలు విషయం అర్థం అయ్యింది. గొలుసు మీద నా దృష్టి పడాలనే మాటలు పెంచుతుంది.

నేను కూడా కావాలనే దాటవేస్తున్నాను.

ఇంక ఉండబట్టలేక పోయింది.

"నా గొలుసు ఎలా ఉంది? మూడు తులాలు. నాలుగు వరసలు. మా అబ్బాయి చేయించాడు ఎలా ఉందో చెప్పు...." మీ అబ్బాయిలెండి, మీ అబ్బాయి కాకపోతే వీధిలో వాళ్లు చేయిస్తారా? అనుకుంటూ "అదేమిటి మామ్మగారు మీ అబ్బాయికి చాలా అప్పులు ఉన్నాయని విన్నాను. గొలుసుదేముంది. ముందు అప్పులు తీర్చెయ్యలేకపోయాడా? వడ్డీలు కట్టుకోవాలికదా? మీ అబ్బాయికి అసలు బుద్ధిలేదు". అన్నాను.

ఒక్కసారి గతుక్కుమంది" ఆc... ఆ మాటే నేను అన్నాను. అయినా పట్టుబట్టి మరీ చేయించాడు. ఎలా ఉందో చెబుదూ?"

"బంగారం సంగతి నాకు తెలీదు మామ్మ గారు."

అదే నీతో వచ్చిన చిక్కు. బంగారం సంగతి తెలీకపోవడం ఏమిటీ? ఎవరైనా నవ్వుతారు. ఎంతైనా బంగారం, బంగారమే. ఆ అందమే వేరు. ఇదేమైనా రోల్డ్‌గోల్డ్ అనుకున్నావా? నిజం బంగారవేం. బంగారం బాగోకుండా ఉంటుందా? ఆ మాత్రం చూసి చెప్పడానికేం.

"ఆ బంగారం బాగానే ఉంటుందని మీరే అంటున్నారు కదా? ఆ మాత్రం దానికి నన్నడగడం దేనికి"

"బాగానే ఉంటుందనుకో అయినా ఎదుటి వాళ్ళు చూసి బాగుందంటే అదో తృప్తి."

"నిజం మామ్మగారు నాకు నిజంగా బంగారం సంగతి తెలీదు."

హc... తెలీదట తెలీదు. నీ కథ నేను చదివి బాగుందని చెప్పానా? కళ్ళు సరిగ్గా ఆనకపోతే ఎక్కలాక్కోని మరీ చదివానా, అంత కష్టపడి చదివిందెందుకు? రాసేవాడికి ఎవరైనా చదివితే ఎంత తృప్తి... అలాగే ఇదీనూ... వస్తువు ఏదైనా చూసి బాగుందంటే అంతకన్నా తృప్తి ఉంటుందా? నీ కథ నేను చదివి బాగుందని చెప్పినప్పుడు నా వస్తువు బాగుందో లేదో చెప్పలేవా?"

"తెలిస్తే చెప్పడానికేం"

"ఛీ ! విశ్వాసం లేని మనుషులు" అంటూ వెళ్ళిపోయింది.

ఎంత వయసు వచ్చినా బుద్ధి రాలేని వాళ్ళ కోవలోకి చెందే ఈ అరవై అయిదేళ్ల మామ్మగారి భావ దారిద్ర్యానికి మనసులోనే నవ్వుకుని ఇంట్లోకి నడిచాను.

## చందాదారులకు విజ్ఞప్తి

చినుకు కవరుపైన చందా ముగింపునెలను సూచించడమైనది. దయచేసి చందా ముగిసినవారు తమ ముగింపునెలను గుర్తించి సకాలంలో చందాను పునరుద్ధరించుకోవలసినదిగా కోరుచున్నాము.